సాక్షి
తిరుపతి
బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



వైభవం.. స్నపన తిరుమంజనం

రాపూరు: లక్ష్మీనరసింహస్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. - 8లో



ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ జాతర జరగనుంది.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	23
తిరుపతి	36	23
తిరుమల	32	20
గూడూరు	38	26
నగరి	38	26

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.28	4.46
చిత్తూరు	6.30	4.46
పుంగనూరు	6.32	4.49

దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్టీలు 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు తెలిపారు. ఎస్టీ విద్యార్థులు అర్హులని, ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా జిల్లా వార్షికోత్సవం



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కొత్త జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఏడాది పూర్తయ్యి.. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితోపాటు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఎస్సీ, బీసీ వేల్ఫేర్ జిల్లా అధికారులు చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు దించేశారు!

అందివచ్చిన అవకాశాలను స్మగ్లర్లు అక్రమ వ్యాపారాల వైపు మళ్లించారు. గుట్టుచప్పుడు కాకుండా బస్సుల్లోనే సుదూర ప్రాంతాలకు వెళ్లి గంజాయి తెచ్చి విక్రయించడం ప్రారంభించారు. ఉత్తర భారతదేశానికి చెందిన పలువురు కూలీలకు, వ్యాపారులకు విక్రయిస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 మంది స్మగ్లర్లు ఒక్కరోజే కటకటాలపాలయ్యారు.

- గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
- ఉమ్మడి జిల్లాలో పోలీసుల సోదాలు
- శ్రీకాళహస్తి, పలమనేరులో 23 మంది స్మగ్లర్ల అరెస్ట్
- స్మగ్లర్ల నుంచి భారీగా గంజాయి స్వాధీనం
- పలువురి స్మగ్లర్లపై పీడీ యాక్ట్ నమోదు



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: మదక ద్రవ్యాలపై ఇటు పోలీసులు.. అటు ఎస్ఈబీ అధికారులు నిఘా పెట్టారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలపై దృష్టి సారించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గంజాయి విక్రయించే వారిని అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి- బుచ్చినాయుడుకండ్రిగ రహదారి మార్గానికి అనుకొని ఉన్న రామచంద్ర మిషన్ వద్ద రూ.9 లక్షల విలువచేసే 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 20 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఎనిమిది మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. వీరంతా గతంలోనే ముద్దాయిలుగా ఉన్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టయిన స్మగ్లర్లను మీడియాముందు ప్రవేశపెట్టారు. అవసరమైతే వీరిని జిల్లా నుంచి బహిష్కరింస్తామన్నారు. అదేవిధంగా పలమనేరులో ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గం'జాయ్'లో మునిగితేలుతున్నారు

గంజాయి ఎక్కడి నుంచి దిగుమతి అవుతుంది?.. ఆ గంజాయిని ఎవరెవరు వినియోగిస్తున్నారన్న దానిపై తిరుపతి జిల్లా పోలీసులు నిఘా పెట్టారు. నార్త్ ఇండియా నుంచి వచ్చిన కూలీలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వీరికి గంజాయి ఎక్కడ నుంచి వస్తోంది? అనే విషయాలపై అడిషనల్ ఎస్పీ రాజేంద్ర, కులశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వివరాలు సేకరించారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఇతని సొంతూరు రాపూరు మండలం, గొండవోలు గ్రామం. గంజాయిని అరకు నుంచి తెప్పించుకొని పరిసర ప్రాంతాలలో సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా దిగుమతి చేసుకున్న గంజాయిని చెన్నై, కేరళకు కూడా సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. నాగేంద్ర ద్వారా స్మగ్లర్లందరినీ అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వివరించారు. వీరే కాకుండా ఇంకా చాలామంది ఉన్నారని తెలిపారు.

ఏడాదిలో 60 కేసులు

ఏడాది కాలంలో తిరుపతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 60 కేసులు నమోదవగా.. 215 మంది నిందితులను అరెస్టుచేశారు. 316 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఆ స్మగ్లర్ బస్సుల్లోనే ప్రయాణం

ప్రధాన స్మగ్లర్ నాగేంద్ర గతంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డాడు. ఇతనిపై తొట్టంబేడు పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇతను తిరుపతిలో ఎనిమిదేళ్లు జీప్ డ్రైవర్‌గా ఉంటూ పరిచయాలు పెంచుకున్నాడు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, రేణిగుంట, చిత్తూరు, తిరుపతి టౌన్, చెన్నై, కర్ణాటకలోని కోలార్ తదితర ప్రదేశాల్లో గంజాయి సరఫరా చేయడానికి ఒప్పందం కుదుర్చుకునేవాడు. విశాఖపట్టణం, ఇతర ప్రదేశాల నుంచి గంజాయిని తీసుకొచ్చేవాడు. ఎవ్వరికీ అనుమానం రాకుండా బస్సులోనే ప్రయాణం చేసేవాడు. ఎప్పటిలాగే సోమవారం కూడా విశాఖపట్నం నుంచి బస్సులో గంజాయి తీసుకొచ్చి శ్రీకాళహస్తిలో విక్రయిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. ఈ మేరకు శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులకు పట్టుబడ్డ స్మగ్లర్లలో ముగ్గురు మహిళలు కూడా ఉండడం గమనార్హం.

నర్సీపట్నం నుంచి ఉమ్మడి జిల్లాలోకి



పలమనేరు పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

పలమనేరు: పలమనేరు, గంగవరం పోలీసులు మంగళవారం పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికిప్రధాన కారణమైన సలీం అనే కీలక వ్యక్తితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుల సమాచారంతో సరుకు నర్సీపట్నం నుంచి వస్తున్నట్టు గుర్తించారు. విశాఖ జిల్లా నర్సీపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిసాల్లోని బరంపురం ప్రాంతాల నుంచి వస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఇచ్చాపురం నుంచి 16వ నంబరు జాతీయ రహదారిమీదుగా నెల్లూరు, తిరుపతి బైపాస్, చిత్తూరు బైపాస్, పలమనేరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోకి అక్రమరవాణా సాగుతోంది.

సమాచారం ఇవ్వండి

"మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల గురించి 14500 లేదా 100కి ఫోన్ చేసి సమాచారం అందించండి. మాదక ద్రవ్యాల నివారణలో పోలీస్‌శాఖకి సహకరించండి.

– పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

రాపూరు:రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు పరిధిలోని అడవుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా పెట్టినట్టు నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. రాపూరు అటవీశాఖ కార్యాలయాన్ని మంగళవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో ప్రతి రోజూ రాత్రి కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అడవుల్లో గట్టి నిఘా ఉండడంతో తమిళ కూలీలు వెనుదిరిగి వెళ్లి ఉంటారని చెప్పారు. అటవీశాఖ, పోలీసుశాఖ సమన్వయంతో గట్టి నిఘా ఉంచామన్నారు. వన్యప్రాణులు నీటికోసం గ్రామాల్లోకి వస్తుంటాయని, వాటికి హానికలిగించకుండా చూడాలని స్థానికులకు సూచించారు. అడవులకు నిప్పు పెట్టడం తగ్గిందన్నారు. ఆయన వెంట రేంజర్ రవీంద్రబాబు, భాస్కర్‌రెడ్డి, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి: గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెంకటగిరి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 4 నుంచి 24వ తేదీ వరకు **aprs. apefss. in** వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మే 20వ తేదీన స్థానిక గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

భూసేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: రైల్వేలైన్‌కు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన డివిజన్‌స్థాయి తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్వోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన సాగరమాల ప్రాజెక్టు లబ్ధిదారులకు అందజేస్తున్న నష్టపరిహారం చెల్లింపులు ఏ మేరకు జరిగాయి తదితర విషయాలపై చర్చించారు. అలాగే నడికుడి– శ్రీకాళహస్తి బీజీ రైల్వే లైనుకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.



తిరువీధుల మెరసీ దేవదేవుడు!

తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఉదయం శ్రీమలయప్ప స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. గోవింద నామస్మరణతో భక్తులు స్వర్ణరథాన్ని లాగి తన్మయత్వం చెందారు. అనంతరం స్వామివారు వసంతోత్సవ మండపానికి వేంచేశారు. స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది.

– తిరుమల



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,750
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,416
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,300
రిటైల్ వెండి గ్రాము	రూ.76.30

బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ

నాయుడుపేటటౌన్: అదృశ్యమైన బాలుడి ఆచూకీని పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని జైహింద్ కాలనీలో ఉన్న మధు కుమారుడు జయంత్ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూలులో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. పాఠశాలకు కూడ వెళ్లకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు భయాందోళలకు గురై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ వైవీ సోమయ్య సారధ్యంలో ఎస్‌ఐ శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టి బాలుడి ఆచూకీ కొనుగొని, తల్లిదండ్రుల అప్పగించారు.

వైభవం.. స్నపన తిరుమంజనం



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

రాపూరు: పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవారి కల్యాణ మండపంలో నిత్య హోమం, 10 గంటలకు స్వామి వారి నందనవనంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పాలు, తేనె, చందనం, పసుపు, పెరుగు, కొబ్బరి జలాలతో అభిషేకం చేశారు.

శేషుడిపై నృసింహుడు

పెంచలకోన క్షేత్రంలో జరుగుతున్న వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు ఉభయనాంచారులతో శేష వాహనంపై నరసింహస్వామి విహరించి, భక్తులను కటాక్షించారు. స్వామివారి అలంకార మండపంలో నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవీ ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి, మంగళవారయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన సంగమేశ్వరాలయం

కోట: మండలంలోని గూడలిలో ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మాలేపాటి భాస్కర్ రెడ్డి, ఈఓ శశాంక్‌కుమార్ మంగళవారం తెలిపారు. గూడలిలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. ఈ నెల 5వ తేదీన అంకురార్పణతో బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. పదిరోజుల పాటు బ్రహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 14వ తేదీ స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు వేలాదిమంది తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ లాజరస్



భూములను పరిశీలిస్తున్న ఆర్ఐ విజయ్

ఓజిలి: భూమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రీసర్వే చేస్తుందని తహసీల్దార్ లాజరస్ అన్నారు. మండలంలోని బట్లకనుపూరులో మంగళవారం రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొంటున్న భూసమస్యలను పరిష్కారించడానికే జగనన్న భూహక్కు.. భూరక్ష పథకాన్ని ప్రారంభించారన్నారు. పంచాయతీల్లో రీసర్వేతో భూసమస్యలను పరిష్కారించామన్నారు. రీసర్వేలో ఎలాంటి అభ్యంతరాలున్నా రైతులు, అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో దిలీప్, నాయకులు రవీంద్రర్‌రెడ్డి, గురవయ్య పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన

ఇనుగుంట రెవెన్యూ పరిధిలో ఉన్న వివాదాస్పద భూములను ఆర్ఐ విజయ్, సర్వేయర్ గోపిరెడ్డి పరిశీలించారు. ఆర్ఐ మాట్లాడుతూ భూములు పరిశీలించి, సర్వే చేశామన్నారు. ప్రస్తుతం భూమిలో సాగులో ఉన్న లబ్ధిదారులు, భూములపై ఫిర్యాదు చేసిన వజ్జవారిపాళెం దళితులతో మాట్లాడి ఇరు వర్గాల నుంచి వివరాలు సేకరించామన్నారు. తహసీల్దార్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

గూడూరు: కోనేటిమిట్టలో ఉన్న సీతా రామాంజనేయస్వామివారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు హనుమంత వాహనంపై విహరించారు. ఉదయం ప్రత్యేక హోమం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశివ లలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులు భరతనాట్యం, జానపద, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. కళాకారులకు వైఎస్సార్ సీపీ నేత ఎల్లసిరి గోపాల్‌రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎం శివకుమార్, సాయిచరణ్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, ధర్మకర్తలు యూ పెంచలయ్య, డీ సురేంద్రబాబు, పీ సుబ్బయ్య, అర్చకులు నారాయణ, సాయిపవన్ పాల్గొన్నారు.

తడలో పర్యటించనున్న కేంద్ర బృందం



దంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

తడ: ఓడీఎఫ్ వెరిఫికేషన్ నిమిత్తం కేంద్ర బృందం వచ్చే వారం ఓడీఎఫ్‌గా (బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామంగా) ఎన్నికైన కాదలూరు పంచాయతీలో పర్యటించనున్నట్లు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. ఈ బృందం రానున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా డీఎల్‌పీఓ మంగళవారం కాదలూరులో పర్యటించి పరిస్థితులు పరిశీలించారు. ఈ సందర్భంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందికి సూచించారు.

యువతి ఆత్మహత్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో బిహార్‌కు చెందిన నిక్కి(20) ఆత్మహత్య చేసుకుంది. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం.. బిహార్‌కు చెందిన దీపక్ ఏర్పేడు మండలంలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతనికి ఎనిమిది నెలల క్రితం నిక్కితో వివాహం అయ్యింది. ఇటీవల తాను సొంతూరికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లాడు. ఆపై రాలేదు. మనస్తాపంతో నిక్కి ఉంట్లో ఉరివేసుకుని తనువు చాలించింది.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం:: తిరుపతి - 517502

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణము మరియు అడవులు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 ననుసరించి శ్రీ కె.శ్రీనివాసులు రెడ్డి వారిచే సర్వేనెం.783, కొత్తపట్నం (V) కోట (M), తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ పరిధిలో ప్రతిపాదించబడిన సిలికా సాండ్ మైను వెలికి తీయుటకు ప్రతిపాదించినారు. లీజు ఏరియా 5.354 హెక్టార్లు (సిలికా సాండ్– 44,712 టీపీఏ) చేసి వెలికి తీయుటకు పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి వారిచే ఈ ప్రకటన జారీ చేయబడినది. ప్రతిపాదిత కార్యకలాపాల యొక్క వివరములు ఈ క్రింద వివరించబడ్డాయి.

1. కంపెనీ పేరు,చిరునామా మరియు టెలిఫోన్ నెం.	శ్రీ కె.శ్రీనివాసులురెడ్డి, సిలికా సాండ్ మైను (5.354హెక్టార్లు), సర్వేనెం.783, కొత్తపట్నం (V), కోట (M), తిరుపతి జిల్లా,ఆంధ్రప్రదేశ్, సెల్: 9441870577 & 9448779059 ఈమెయిల్:gsrminerals123@gmail.com
2. కార్యకలాపాల నిర్వహణకు ప్రతిపాదించబడిన ప్రదేశము మరియు విస్తీర్ణం	సర్వేనెం.783, కొత్తపట్నం (V), కోట (M), తిరుపతి జిల్లా,ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొత్తం విస్తీర్ణం 5.354 హెక్టార్లు.
3. సంప్రదించవలసిన సంబంధిత కంపెనీ అధికారి పేరు,చిరునామా మరియు ఫోన్‌నెంబరు	శ్రీ కె.శ్రీనివాసులురెడ్డి., ఫ్లాట్ నెం.202, పావని ఓష్మిమ అపార్ట్‌మెంట్, మాగుంట లేఅవుట్, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 524003 సెల్: 9441870577 & 9448779059 ఈమెయిల్:gsrminerals123@gmail.com
4. ప్రతిపాదిత కార్యకలాపాలకు కేటాయించిన పెట్టుబడి	రూ.111.50 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	సిలికా సాండ్ మైను లీజు ఏరియా 5.354 హెక్టార్లు (సిలికా సాండ్ – 44, 712టీపీఏ) చేసి వెలికి తీయుటకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 06.05.2023 సమయం : ఉ.10.30 గంలకు ప్రదేశం : సర్వేనెం.783, కొత్తపట్నం (V), కోట(M), తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ప్రతిపాదిత మైను లీజు ఏరియా వద్ద

7. ప్రతిపాదనకు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ & REIA రిపోర్టులను ప్రజల సౌకర్యార్థం ఈ క్రింది కార్యాలయముల్లో లభ్యపరచబడ్డాయి.
a) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, తిరుపతి జిల్లా
b) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, నెల్లూరు, నెల్లూరు జిల్లా
c) జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, తిరుపతి జిల్లా
d) రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము, గూడూరు, తిరుపతి జిల్లా
e) యస్.కె.శ్రీవాస్తవ, డైరెక్టర్ ఇండస్ట్రీస్–1ఎ–II మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ & క్లైమేట్ ఛేంజ్(MoEF & CC), గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇందిరా పర్యావరణ భవన్, జోర్బాఘ్ రోడ్డు, న్యూ ఢిల్లీ– 110003
f) ది అడిషినల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సి),మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ & క్లైమేట్ ఛేంజ్ వారి కార్యాలయము, కెథడ్రల్ గార్డెన్‌రోడ్డు, నుంగంబాక్కం, చెన్నై–600034
g) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, బోర్డు ఆఫీస్, కస్తూరిబాయిపేట, విజయవాడ
h) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, జోనల్ కార్యాలయము, కృష్ణా నగర్ రైల్వే గేట్ దగ్గర, కర్నూలు
i) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, ప్రాంతీయ కార్యాలయము, ఎన్.టి.రోడ్డు, తిరుపతి
j) తహశీల్దారు వారి కార్యాలయము, కోట (M), తిరుపతి జిల్లా
k) గ్రామ పంచాయతీ కార్యాలయం, కొత్తపట్నం(V), కోట (M), తిరుపతి జిల్లా

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ ఎస్.ఓ.నెం.1533 తేది: 14.09.2006లో పేర్కొనబడిన (వరుస క్రమము 7III(ఐ) (ఎ) మరియు (బి)లలో) రీతిలో ఈ ప్రతిపాదన కార్యకలాపాలకు సంబంధించి ప్రజల నుండి మరియు పర్యావరణ సంబంధిత అంశముల వల్ల ప్రభావితపు ప్రజల నుండి వ్యాఖ్యలు, అభ్యంతరములు ఏవైనా వున్నట్లయితే వాటిని లిఖిత పూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలోపు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, తిరుపతి వారికి తెలుపవచ్చును. అటువంటివారు, పైన పేర్కొనబడిన తేదీన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో కూడా పాల్గొని తమ అభిప్రాయములు స్వయముగా తెలుపవచ్చును.

సం/–
ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, తిరుపతి

ప్రదేశం : తిరుపతి
తేది : 05.04.2023